# భయాన్ని వెదజల్లారు!!!


నవతరం
తెలుగు దినపత్రిక
RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 112 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
28-02-2026 శనివారం వెల : 1 /- పేజీలు : 4





- భయం గుప్పిట్లో పట్టణ ప్రజానీకం??
- రోజురోజుకు పెరుగుతున్న డయేరియా కేసులు???
- కేసులు పెరుగుతున్నప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం లేదు.
- రాజకీయాలను ప్రజలు పట్టించుకోవద్దు.
- కమిషనర్ ఎవరు వచ్చినా మనలో వ్యాధినిరోధక శక్తి పెరగాలి

**(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)**

శ్రీకాకుళం పట్టణంలో డయేరియా అంటూ భయాన్ని వెదజల్లారు. మున్సిపల్ నీటిని తాగేందుకు పట్టణంలోని చాలా మంది ప్రజలు భయపడుతున్నారు. ఇదే అదనుగా వాటర్ బాటిల్, బబుల్స్ వ్యాపారం జోరుగా సాగుతోంది.
మున్సిపల్ వాటర్‌ను బాగా కాచి చల్లార్చి తాగినా ఫర్వా లేదు. అయినప్పటికీ భయాందోళనలతో పేద ప్రజలు సైతం డబ్బాలతో నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ సస్పెండ్ కావడం, కొత్త కమిషనర్ రావడం, వెనుతిరగడం, మరో కమిషనర్‌ను నియమించడం వంటి వేగవంతమైన చర్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.
కొన్ని ప్రాంతాల్లో డయేరియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో అక్కడ స్థానికంగా ఉన్న సంచి డాక్టర్ల వద్ద కూడా వైద్యం పొందుతున్నారు. చాలా మంది డయేరియా నుంచి బయటపడ్డారు.
డయేరియా వ్యాధి భయపడాల్సిన అంశం కాదని, ముందుజాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వైద్యులు చెబుతున్నారు. రాజకీయాలు ఎలా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టాలి. ఆ పనిని క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటనలు చేస్తూ అధికారులను కార్యోన్ముఖులను చేస్తున్నారు. ముఖ్యంగా ఆయన చేయాల్సిన పని ఏమిటంటే డయేరియా అనే భయాన్ని ప్రజల నుంచి పారద్రోలాలి. ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలో వాటిని వైద్యులు ప్రజల్లోకి తీసుకువెళ్లేలా స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతంగా ప్రచారం చేయాలి. అలాగే వీధుల్లో అపరిశుభ్రతను తొలగించి పరిశుభ్రతను కల్పించాలి. కాలువలను శుభ్రం చేసి అవసరమైన మందులను చల్లాలి. ప్రభావిత ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా డయేరియా నిరోధక చర్యలు ప్రారంభించాలి.
మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కొళాయిలకు సంబంధించిన గ్రౌండ్ లెవెల్‌లో ఉన్న వాటర్ గొట్టాలు సుమారు 30 నుంచి 40 ఏళ్ల కిందటివి అయ్యి ఉండొచ్చు. కొన్ని చోట్ల మార్చి ఉండవచ్చు. ప్రస్తుతం నాణ్యమైన, తుప్పు పట్టని ఇనుప గొట్టాలను వేసి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది.
అలాగే ప్రజల్లో వ్యాధినిరోధక శక్తి పెరగడానికి తీసుకోవాల్సిన కార్యక్రమాలు, తినాల్సిన ఆహార పదార్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి.
ముఖ్యంగా నగరంలోని కర్రీ పాయింట్లు ప్రజలకు ఆందోళన కలిగిస్తున్నాయి. వేడి వేడి సాంబారు, రసాలను ప్లాస్టిక్ కవర్లలో వేసి అమ్ముతున్నారు. ఇలాంటి పదార్థాలను తినడం వల్ల కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ కూడా అటువైపు దృష్టి సారించడం లేదు.
అలాగే ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని వినియోగించడం తగ్గించాలని స్వతంత్ర శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వల్లి కూడా పలుమార్లు సూచిస్తున్నారు. అలాంటి ఆరోగ్య సూత్రాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి అవగాహన కల్పించాలి. ప్రజలను ఆరోగ్యవంతమైన జీవన విధానాల వైపు తీసుకువెళితే రోగాల భయం ఉండదు. మందుల వినియోగం కూడా తగ్గుతుంది. దీని ద్వారా ప్రభుత్వానికి మందుల కోసం ఖర్చు చేయాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.
సమస్య వచ్చినప్పుడు అందరూ స్పందిస్తారు. కానీ సమస్యను ముందుగానే గుర్తించేలా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.
సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ లోపం కారణంగానే డయేరియా విజృంభణ జరిగిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో, ఇప్పటికైనా అధికారులు మరోసారి ఇలాంటి పరిస్థితి ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలి.
భయాన్ని వెదజల్లకుండా అవగాహన పెంచడం, వ్యాధినిరోధక శక్తి పెంపు సూత్రాలు, బలవర్ధక ఆహారం వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది.
అలాగే భయాన్ని వెదజల్లుతున్న సోషల్ మీడియాలోని కొందరిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

---

## తాగునీటిలో 'ఈ-కోలి'..
## అందుకే డయేరియా

- 11 నమూనాల్లో బ్యాక్టీరియా గుర్తింపు..
- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్



3లో

## విద్యార్థులు సమాజసేవలో భాగం కావాలి

- న్యూ సెంట్రల్ పాఠశాల డైరెక్టర్ పి. శ్రీకాంత్
- మార్చి 1న విద్యార్థుల హయాంలో రక్తదాన శిబిరం

4లో



## సూపర్ సిక్స్ ఓ పెద్ద అబద్ధం



- ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలు 143..
- ఒక్కటి కూడా అమలు చేయలేదు
- ప్రమాదకరంగా ప్రజారోగ్యం
- ప్రజా రంజక పాలన అందివ్వడంలో విఫలమైన కూటమి సర్కార్
- పథకాలు ఎగ్గొట్టడానికి ఆర్థిక వ్యవస్థ ధ్వంసమంటూ తప్పుడు ప్రచారం

2లో

## ఆపదలో అందుబాటులో ఎమ్మెల్యే గొండు శంకర్

టీడీపీ అధికార ప్రతినిధి పి ఎం జె బాబు

2లో



## సోము వీర్రాజుపై దాడి హేయమైన చర్య

- ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ
- విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం

3లో



ఎడిటోరియల్

# సముచిత పిలుపు


ప్రపంచ దేశాలన్నింటినీ దోచుకుంటూ, పెత్తనం సాగిస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా టారిఫ్ బాధిత దేశాలన్నీ ఐక్యంగా పోరాడాలన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా పిలుపు అత్యంత సముచితం. ఐదు రోజుల భారత్ పర్యటనలో వాణిజ్యం రెట్టింపు చేసుకోవాలని బ్రెజిల్, భారత్ నిర్ణయించడం శుభ పరిణామం. ఎఐ సదస్సుకు హాజరైన ఆయనతో ఖనిజాలు, ఉక్కు, మైనింగ్, డిజిటల్ సహకారం, వాణిజ్యం, ప్రాదేశిక సార్వభౌమాధికారం, రేర్ ఎర్త్స్, శిలాజ ఇంధనాలు తదితర అంశాలకు సంబంధించి మనదేశం పలు ఒప్పందాలు చేసుకుంది. ఈ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు మనదేశంతోపాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరించాల్సిన పాత్రకు సంబంధించి ఒక సందేశాన్ని పంపాయి. బలవంతుడైన యజమానితో కార్మికులంతా ఐక్యమై చర్చలు జరిపితే విజయం సాధించడం సులభం. అగ్రరాజ్యం అమెరికా పట్ల కూడా అదే వైఖరి అనుసరిం చాలని కార్మిక నేతగా, బ్రెజిల్ అధ్యక్షుడిగా ఆయన చేసిన సూచన భారత్ సహా అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటికీ ఉపయోగకరం. గ్రేట్ ఫ్రెండ్, గుడ్ ఫ్రెండ్, శాంతి దూత... ట్రంప్ నాయకత్వంలో శాంతి, సంపద, స్థిరత్వం సాధ్యమవుతుందంటూ పొగడ్తలు కురిపించే, ట్వీట్లు చేసే ప్రధాని మోడీ ఇకనైనా లొంగుబాటు ధోరణికి స్వస్తి పలకడం భారత్ ప్రయోజనాలకు అత్యవసరం.

అమెరికా అత్యధికంగా యాభై శాతం సుంకాలను బ్రెజిల్‌తోపాటు మనదేశంపై విధించింది. దీనిపై ఇరు దేశాలు స్పందించిన తీరు భిన్నంగా ఉంది. అమెరికా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నందున వేచి చూసే ధోరణిని భారత్ మినహా బ్రిక్స్ దేశాలన్నీ అనుసరించాయి. 1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఇఇపిఎ) కింద గత ఏడాది ఏప్రిల్ నుంచి సుంకాలు విధిస్తున్న ట్రంప్ చర్యలు చెల్లబోవని అమెరికా సుప్రీంకోర్టు 6-3 మెజారిటీతో తీర్పు ఇవ్వడం ప్రపంచానికి ఊరటనిచ్చింది. ఈ తీర్పును వమ్ము చేయాలనే ఉద్దేశంతో ట్రంప్ అన్ని దేశాలపై సెక్షన్ 122 కింద 15 శాతం అదనపు సుంకాలు విధించారు. ఈ తీర్పు వచ్చే వరకూ వేచివుండకుండా అమెరికాతో ఒప్పందం కుదుర్చుకోవడం మన దేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోంది. అమెరికా 18 శాతం సుంకాలు విధిస్తే మనదేశంలో సుంకాలేవీ లేకుండానే అమెరికా సరుకులు విక్రయించేలా గేట్లు బార్లా తెరిచేందుకు మోడీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం అవమానకరం.
అమెరికన్ ఉత్పత్తులపై 30 నుంచి 35 శాతం విధిస్తున్న సుంకాలను వెనక్కి తీసుకుంది. మూడు నుంచి ఐదు శాతం సుంకం పరిధిలోని భారత ఉత్పత్తులకు పద్దెనిమిది శాతం సుంకం విధించేందుకు అమెరికాతో ఒప్పందం చేసుకుని, ఇదే అతి పెద్ద విజయంగా కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. జీరో శాతం సుంకాల వల్ల వ్యవసాయరంగం, డెయిరీపై ఆధారపడిన మనదేశ రైతులు రోడ్డున పడతారు. ఓ రెండు వారాలు ఆగివుంటే అవమానకరంగా అమెరికా షరతులను అంగీకరించే పని లేకుండానే పదిహేను శాతం సుంకాలతో ఒప్పందం కుదుర్చుకునేందుకు అవకాశం ఉండేది. యుఎస్ఎ సుప్రీంకోర్టు తీర్పును పరిశీలిస్తున్నామని మనదేశంతోపాటు ఒప్పందాలు చేసుకున్న అనేక దేశాలు ప్రకటించాయి.
'ఆటలాడొద్దు'అంటూ ట్రంప్ తాజాగా ప్రపంచ దేశాలనుద్దేశించి అవమానకరంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. 27 దేశాల యూరోపియన్ యూనియన్ ఐక్యంగా ట్రంప్ ఏకపక్ష టారిఫ్‌లను ఎదుర్కొన్న తీరు కూడా మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంలో మార్పు తేలేకపోవడం సిగ్గుచేటు. స్వాతంత్ర్యానంతరం స్వతంత్రంగా అలీన విధానాన్ని తీసుకుని వందకు పైగా దేశాలకు భారత్ నాయకత్వం వహించింది. ఆ వారసత్వాన్ని నిలబెట్టుకోకుండా అమెరికాకు సాగిలపడటం వల్ల ఎటువంటి మినహాయింపులు పొందలేకపోతున్నది. అన్నదాతలకు, పశు పాలకులకు ఎటువంటి నష్టం కలగనివ్వబోమని పార్లమెంట్‌లో గంభీర ఉపన్యాసం ఇచ్చిన మోడీ ఆ మాటను నిలబెట్టుకోవడం అత్యవసరం. అమెరికా ముందు సాగిలపడి చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని, కొత్తగా ఒప్పందం చేసుకోవాలి. అందుకు చర్యలు తీసుకునేలా కేంద్రం మెడలు వంచేందుకు ప్రజలంతా సమాయత్తం కావాలి.

# పశ్చిమగోదావరి జిల్లాలో.... సర్వపాప హరణం శ్రీరాట్నాలమ్మ




మహర్షి శాప విమోచన కోసం 'గోదావరి దివి నుంచి భువికి దిగివచ్చిందని పౌరాణిక కథనం. ధాన్యాగారంగా, చారిత్రాత్మకంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న జిల్లా పశ్చిమ గోదావరి, ఇంతటి ప్రాచుర్యం కలిగిన ఈ జిల్లాలో పుణ్యక్షేత్రాల నిలయం అన్న చందాన జిల్లాలో ప్రసిద్ధిగాంచి కోట్లాది భక్తుల నీరాజనాలు అందుకుంటున్న కల్పవల్లి శ్రీ రాట్నాలమ్మ అమ్మవారు. పశ్చిమగోదావరి జిల్లాలోని తీర ప్రాంతాన్ని ఎందరో మహారాజులు, చక్రవర్తులు పాలించినారు. వారిలో తూర్పు చాళుక్యులు ముఖ్యులు. వీరినే వేంగిలని, రెడ్డి రాజులని, ఆర్యులని పిలిచేవారు. ఈ తూర్పు చాళుక్యుల కాలంలోనే శ్రీశ్రీశ్రీ రాట్నాలమ్మ అవిర్భావం జరిగిందని నానుడి. వివరాల్లోకి వెళ్తే అప్పటి వేంగి రాజుల ఖాజానాలు విశేషమైన రత్న సంపదలతో మణి మాణిక్యాలతో వజ్ర వైఢూర్యాలతో తులతూగేవి. ఈ సంపదంతా కేవలం దేవానుగ్రహం వలన సమకూరింది. ఈ సంపద కాపాడుట మానవుల వల్ల కానందున ఒక మహాశక్తిని వేంగిరాజులు ఆశ్రయించినారు. ఆ శక్తిని వారు ఇలవేల్పుగా కొలిచి ఆధిపత్యమిచ్చినారు. ఆ శక్తిమాత శ్రీ రాట్నాలమ్మ అమ్మవారు. కలి ప్రభావంగా దేశాలలోని ఖజానాలు కొల్లగొట్టబడుతూ వుండేవి. కాని వేంగి దేశ ఖజానా నిత్య కళ్యాణం, పచ్చతోరణం అనే చందంగా సిరిసంపదలతో తులతూగుతూ వున్నది. ఇది చూసి కొందరు దొంగలకు కన్నుకుట్టినది. ఈ ఖజానాను కూడా కొల్లగొట్టాలనే దుర్బిద్ధితో దొంగలు వేంగి రాజ్యాంలో ప్రవేశించాడు. కాని వారి ఆశ అడిఆశే అయింది. దానికి కారణము. శక్తి రూపిణి, శ్రీ రాట్నాలమ్మ అమ్మవారు ఆగ్రహించి ఆ దొంగలను రాజ్యం వదిలే వరకు తరిమికొట్టింది.
ఈ హఠాత్ పరిణామానికి కంగుతిన్న చోరులు ఎలా అయినా సరే ఈ సంపదను హస్తగతం చేసుకోవాలని పట్టుదలతో ఒక మాంత్రికుని ఆశ్రయించినారు. ఈ వృత్తాంతమంతా చెప్పి అక్కడ వున్న రత్న సంపద దైవనుగ్రహ ప్రసాదమని అది ఉంటే నీవు ఇంకా శక్తులు వశం చేసుకోవచ్చని ప్రలోభపెట్టి ఆ మాంత్రికుణ్ని తీసుకువచ్చారు. గ్రహణ సమయంలో దేవతలు ఆశక్తులు అవుతారని తెలిసిన ఆ మాంత్రికుడు ఒకానొక చంద్రగ్రహణము రోజున పూజ ప్రారంభించి దుష్టగ్రహ సమయంలో మంత్ర ఖడ్గాన్ని సంపాదించి వెంటనే ప్రయోగించినారు. అది నేరుగా వచ్చి రూపంలో వున్న అమ్మవారి కంఠాన్ని తుంచివేసింది. కాని అప్పటికే అమ్మవారి కోపాగ్నికి ఈ ప్రాంతంలోని అరణ్యమంతా దగ్ధమైంది. అందుకే ఆలయం నుండి కోట వరకు గొప్ప కీకారణ్య వున్నా నేడు ఒక వృక్షము కూడా కానరాదు. అప్పటి ఈ సంఘటనకు ఇదియే ప్రత్యక్ష నిదర్శనము ఆ అగ్నికీలలు మాంత్రికుణ్ణి. ఆ దుష్టచోరులను దహించివేశాయి. ఈ పరిణామానికి కారణము తెలియని వేంగి చక్రవర్తి అస్థాన జ్యోతిష్యులను రాజపురోహితులను సమావేశపరిచి విషయం విన్నవించెను.
ఆ మహాపండితులు జరిగిన విషయం గ్రహించి మహారాజా మీ ఇంట ఇలవేల్పు, మన సామ్రాజ్యధి దేవతను ఎవరో దుష్టులు కట్టడి చేయుటకు ప్రయత్నించి విఫలమైనవారు. అందుకే ఆ శక్తికి ఆగ్రహం కలిగి వారిని తన కోపాగ్నితో భస్మము చేసింది. అని ఆ మాతను శాంతివ చేయుట మన తక్షణ కర్తవ్యమని, అలా చేయని ఎడల సామ్రాజ్యానికే ముప్పు అని హితవు పలికారు. వెంటనే మహారాజు తన రాజ్య ప్రజలతోనూ రాణులతో వంది మాగధుల సమేతుడై శక్తిని చేరి శరణువేడాడు. విశేష రత్నాలతో అర్చనలు చేశాడు. ఈ అర్చనలకు పూజలకు శాంతించిన మాత సంతుష్టురాలై మహారాజుకి అభయమిచ్చి వరము కోరుకోమన్నది. అప్పుడు మహారాజు భక్తితో నమస్కరించి అమ్మా నీ చల్లని పాదాల నీడలో నా రాజ్యము, ప్రజల సుఖసంతోషాలలో తూలతూగాలి. నీ దర్శన భాగ్యము మాకు ఎల్లప్పుడు కలగాలి. నీ పాద సేవ భాగ్యము మాకు కల్పించమని పరివిధాల ప్రార్థించాడు.
అందుకు అమ్మవారు ప్రసన్న హృదయముతో ఓ మహారాజు రత్నాలు అర్పించి నన్ను శాంతింప చేశావు. కాబట్టి నేను నా పరివార దేవతలతో ఈ వేంగిపుర ప్రాంతంలో రత్నాలమ్మగా పూజలందుకుంటాను అని చెప్పింది. ఒక చేతి ఖడ్గముతో మరొక చేతితో అమృత కలశములతో, పులి వాహనముతో ఈ ప్రాంతంలో వెలిసింది. అలాగే బ్రహ్మ, ఈశ్వరుడు, విష్ణువు. కాలభైరవుడు, కుమారస్వామి, చతుర్భుజ దుర్గాదేవి, షడ్భుజ దుర్గాదేవి వీరులు సుబ్రహ్మణ్యస్వామి, సప్త మాతృకలు వైదేహీ సూర్య ఉషాదేవి మొదలగు పరివార దేవతలతో ఇక్కడ కొలువైంది. నాటి రత్నాలమ్మీ కాలగర్భంలో నేటి రాట్నాలమ్మగా ప్రసిద్ది చెందింది. ప్రతి ఏటా అమ్మవారికి చైత్రశుద్ధ పౌర్ణమి నుండి ఏడు రోజుల పాటు శ్రీ రాట్నాలమ్మ అమ్మవార్ని తిరునాళ్లు ఉత్సవాలు మహావైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల సమయంలో రాష్ట్రం నలుమూలల నుండి భక్తులు విచ్చేయటం విశేషం. ఈ ఆలయాన్ని దర్శించుకోవడానికి చేరుకోవలిసిన మార్గాలు హైదరాబాద్ నుండి వయా ఖమ్మం, సత్తుపల్లి నుండి చేరుకొనవచ్చును.
విశాఖపట్నం నుండి రైలు మార్గం ద్వారా తాడేపల్లి గూడెం దిగి అర్టిసి బస్ ద్వారా చేరుకోగలరు. విజయవాడ నుండి ఏలూరు వచ్చినా ఏలూరు నుండి 15 కి.మీ. ఏలూరు నుండి ఈ దేవాలయానికి నాలుగు దిక్కుల నుండి మార్గము కలదు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# సూపర్ సిక్స్ ఓ పెద్ద అబద్ధం

- మంచినీళ్లు అందివ్వ నోళ్లు.. ఇంటింటా ఇంటర్నెట్ ఇస్తారట!
- రెడ్ బుక్ రాజ్యాంగం కాదు.. అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేయాలి
- వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు

**నవతరం -పలాస**

అధికారమే పరమావధిగా భావించిన కూటమి పార్టీలు ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చినప్పటికీ, సుమారు 143 హామీలతోపాటు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిన గాని, కనీసం సూపర్ సిక్స్ పథకాల అమలు ఒట్టి అబద్ధమని కూటమి సర్కార్ నిరూపించుకుందని వైయస్సార్సీపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన పలాసలో మీడియాతో మాట్లాడుతూ, వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం వివిధ సంక్షేమ పథకాలే కాక అభివృద్ధి పరంగా అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రధానంగా నిరుపేదలకు అర్హులైన వారందరికీ ఇండ్ల స్థలాలతోపాటు నూతన గృహాలు నిర్మాణానికి ఆర్థిక సాయం అందించడం జరిగిందన్నారు. అలాగే నాడు- నేడు మనబడి పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు ఆధునికరించడం జరిగిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసి దేశంలో అధికార వికేంద్రీకరణ క్షేత్రస్థాయిలో జరిగే విధంగా గొప్ప విప్లవాత్మక సంస్కరణలకు పునాదులు వేశారన్నారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, ఇతర శ్రామిక వర్గ ప్రజానీకం అవసరాల మేర వివిధ సంక్షేమ పథకాలు వైయస్సార్సీపి ప్రభుత్వంలో అమలు చేయబడ్డాయని బమ్మిడి దుర్యోధనరావు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మెజార్టీ ప్రజానీకం హర్షించే విధంగా ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను రద్దు చేయాలని, ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఎగ్గొట్టడానికి , ఒకటి అరా ఇచ్చిన పూర్తిగా కోతలు విధించడానికే ఆర్థిక వ్యవస్థ ధ్వంసం అయిందంటూ తప్పుడు ప్రచారం కూటమి ప్రభుత్వం చేస్తుందని బమ్మిడి దుర్యోధనరావు మండిపడ్డారు. దీపం పథకంలో భాగంగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇస్తామని చెప్పిన చంద్రబాబు మాట తప్పిపోయారని ఆయన ఆక్షేపించారు. అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలులో కూటమి సర్కార్ నిధులకు కోతలు విధించి, కర్షకుల కంట కన్నీరు రప్పిస్తుందన్నారు అమ్మ ఒడి బదులు తల్లికి వందనం పథకంలో అర్హులను తగ్గించి, తూతూ మంత్రంగా ఈ పథకాన్ని నిర్వీర్యం చేశారన్నారు. దీపం పథకంలో భాగంగా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పారని, మొత్తం 1.55 కోట్ల లబ్ధిదారులు ఉంటే 86 లక్షల మందికే ఒక్కో సిలిండర్ చొప్పున కేవలం రూ.686 కోట్లు మాత్రమే రియంబర్స్ చేసినట్లు సాక్షాత్తు గవర్నర్ తోనే చెప్పించారని ఆయన గుర్తు చేశారు. తద్వారా ఈ పథకం ఎంత మోసమో తేలిపోయిందన్నారు. వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో నిరుపేదలందరికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకు ఉచితంగా వెజ్జనే అందించడం జరిగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులను కుదించడం వల్ల, సామాన్య ప్రజలతో పాటు మధ్యతరగతి ప్రజానీకం కూడా నానా అగచాట్లు పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో దాదాపు పూర్తయిన ఇళ్ళనే కూటమి ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని, పేదలకు ఇళ్ల నిర్మాణం లో ఏదో చేసినట్లు చెప్పేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మూడు బడ్జెట్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టిన గాని ప్రధానంగా అన్నదాతలను ఆదుకోలేకపోయిందని, కనీసం ఖరీఫ్ సీజన్లో కూడా విత్తనాలు, యూరియా, కాంప్లెక్స్ ఎరువులతో పాటు పురుగు మందులను కూడా అంది ఇవ్వలేక పోయిందని విమర్శించారు. చివరకు ఆరుగాలం శ్రమించిన రైతు పండించిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తూ.. మిల్లర్లు, దళారులకు లబ్ధి పొందే విధంగా రైతన్న సమస్యలను నిర్లక్ష్యం చేసిందని బమ్మిడి దుర్యోధనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ధరల నియంత్రణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎక్కడ కనిపించలేదన్నారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి హామీలు గురించి కూటమి పెద్దలు మాట్లాడటం మానేశారన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కేటాయించవలసిన నిధుల ప్రస్తావన మరిచిపోయారన్నారు. చివరకు ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యం కాబడిందని , ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను కూడా ప్రైవేట్ రంగానికి కట్టబెట్టడానికి కూటమి సర్కార్ సిద్ధమైందంటే, భవిష్యత్తులో ప్రజారోగ్యం ఎంతటి ప్రమాదకర పరిస్థితిలో ఉంటుందో ఆందోళన కలిగిస్తుందన్నారు. కలుషిత నీరు తాగి ప్రజలు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో డయేరియా తో నలుగురు మృతి చెందడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుందన్నారు. అంతకుముందు విజయనగరం జిల్లా కూడా డయేరియా సోకి 16 మంది అకాల మృత్యువాత పడటం తీరు చూస్తే ప్రజారోగ్యం పట్ల కూటమి ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు పట్ల ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థమవుతుందన్నారు. రాజమండ్రిలో కల్తీ పాలు ఘటన , దైవ దర్శనానికి వెళ్లి సింహాచలం, పలాసలో ప్రజలు మృత్యువాత పడడం చూస్తే కూటమి ప్రభుత్వ వైఫల్యం కావడానికి ప్రభుత్వ యంత్రాంగంపై పట్టు కోల్పోయినట్లు కనిపిస్తుంది అన్నారు. ప్రజా రంజక పరిపాలన అందవలసిన పాలకులు ప్రజల తరఫున ప్రజా సమస్యల పై ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై ఉద్దేశి పూర్వకంగా రాజకీయ కక్ష సాధింపులు చేపడుతూ, పోలీస్ కేసుల్లో ఇరికిస్తూ, జైలుకు పంపుతూ.. పైశాచిక ఆనందాన్ని పొందుతూ, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కొనసాగిస్తుందని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని, పాలకుల పదవులు శాశ్వతం కాదని, ప్రజలు ఎన్నుకున్న కాల పరిమితులోనే ఆ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆయన హితవు పలికారు.

# ఆపదలో అందుబాటులో ఎమ్మెల్యే గొండు శంకర్

**నవతరం -శ్రీకాకుళం**

శ్రీకాకుళం పట్టణ పరిధిలో దమ్మలవీధి, కంద్ర వీధి, కాకివీధి, మంగువారితోట, మండేటివీధి తదితర ప్రాంతాలలో ఇటీవల ప్రభలిన డయేరియా విషయం తెలుసుకుని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ హుటాహుటిన విజయవాడ శాసనసభలనుండి బయలు దేరి మంగళవారం రాత్రి 10 గంటలకు కిమ్స్, ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న డయేరియా భాదితులను సందర్శించి వారికి ధైర్యం చెప్పి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికార్లకు సూచించారు. అనంతరం రాంనగర్ ప్రాంతం లో డయేరియా తో మృతిచెందిన సురేష్ కుటుంబానికి పది లక్షల ప్రభుత్వ ఆర్థిక సహాయం చెక్కును అదే రాత్రి జిల్లా కలెక్టర్ సమక్షంలో అందజేశారు. సురేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మరుక్షణం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే ఆర్థిక సాయం మంజూరు చేయించారు. అప్పటి నుండి మున్సిపల్ కార్యాలయంలో ఉండి జిల్లా యంత్రాంగం చేపట్టిన విపత్తు నివారణ చర్యలు స్వయంగా పర్యవేక్షించారు. డయేరియా అదుపులోకి వచ్చేవరకు జిల్లా యంత్రాంగం అహర్నిశలు కృషి చేసారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మాత్యులు నారాయణ సందర్శించి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసారు. ఆదే విధంగా కేంద్ర మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు డయేరియా ప్రాంతాలను, ఆసుపత్రులను సందర్శించి భాదితులకు భరోసా కల్పించారు. కళ్ళముందు ఇంత జరిగినా వైకాపా నాయకులకు అగమ్య గోచరంగా అనిపించి ఏమీ లేకపోతే శవరాజకీయాలు చేస్తుండం చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విపత్తు సమయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ తీసుకున్న చొరవకు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు పాండ్రంకి శంకర్, ఎం ఎస్ ఎం ఇ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రధాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.

# కలిసేది నదులన్నీ కడలిలోనే...!!

మిత్రమా..! ఓ నా ప్రియ నేస్తమా..!!
నీవు కొన్న నీ జేబులో ఉన్న
టిక్కెట్ కు విలువ నీ గమ్యం వరకే
గమ్యం చేరాక అదొక చిత్తుకాగితమే...
నిరుపయోగమే.....నిష్ప్రయోజనమే...

నిజమే ఈ జీవితం సైతం
ఒక నిరంతర ప్రయాణమే...
ఈ జీవితం ఒక నదీ ప్రవాహమే...
ప్రతి నది కదిలి...కదిలి...
కడకు కలిసి పోవాల్సింది కడలిలోనే...

ఓ మిత్రమా..! నా ప్రియ నేస్తమా..!!
ఈలోగా తాను
ప్రయాణించిన దూరం
ప్రయాణించినంత కాలం
బంజరు నేలల్లో బంగారు పండేలా
కర్షకుల కడుపు నిండేలా
కష్టం ఫలించేలా...
నిశ్చలంగా నిస్వార్థంగా...
నిర్మలంగా నిర్విరామంగా ...
ప్రవహిస్తోంది ప్రతినది..ఫలభరితంగా...

మిత్రమా..! ఓ నా ప్రియ నేస్తమా..!!
ఫలించు ఫలించు...పచ్చని చెట్టులా
విహరించు విహరించు...వీచే గాలిలా
పరిమళించు... పరిమళించు...
పూచే పువ్వులా
విరజిమ్ము...విరజిమ్ము
వెన్నెల వెలుగుల్ని ఆరని దీపంలా...

మిత్రమా..! ఓ నా ప్రియ నేస్తమా..!!
నిద్రపోకు నిద్రపోకు...కుంభకర్ణునిలా...
పెట్టకు పెట్టకు...గురకలు
గూటిలోని గుడ్లగూబలా...
గదిలో గాఢాంధకారంలో గబ్బిలంలా...

ఓ మిత్రమా..! నా ప్రియ నేస్తమా..!!
కలమై...
కాగితమై...
కవిత్వమై...
కావ్య ఖండికవై...
కదిలించు...కరిగించు..
ప్రతి పాషాణ హృదయాన్ని...
ఓదార్చు ఓదార్చు ప్రతి కన్నీటి బ్రతుకును
వెలిగించు వెలిగించు ప్రతి చీకటిజీవితాన్ని

మిత్రమా..! ఓ నా ప్రియ నేస్తమా..!!
మిగిల్చాలి...మిగిల్చాలి
నీ జీవితం ముగిసేలోగా
చెరగని కాలానికి కరగని ముద్రలు కొన్ని
మిగిలిపోవాలి నీవు చరిత్రలో..చిరంజీవిగా



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# 1 న రణస్థలంలో హిందీ ప్రతిభా పరీక్ష విజేతల అభినందన సభ

- అతిథులుగా విజయనగరం ఎంపీ, ఎచ్చర్ల ఎమ్మెల్యే తదితరులు
- సహకార మంత్రిత్వ శాఖ హిందీ సలహా సభ్యుడు గైబువల్లి హాజరు
- ఉత్తరాంధ్ర స్థాయి హిందీ ప్రతిభావంతుల అభినందన కార్యక్రమం

**నవతరం -రణస్థలం**

హిందీ సేవా సదన్ (అనంతపురం) ఆధ్వర్యంలో గత నెలలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన జిల్లా స్థాయి హిందీ టాలెంట్ టెస్ట్ జిల్లా టాపర్ల అభినందన కార్యక్రమం మార్చి 1 న ఆదివారం నాడు రణస్థలంలో జరగనుంది. మార్చి 1న ఉదయం 9:30 గంటలకి రణస్థలం మండల కేంద్రంలోగల భాష్యం స్కూల్ ఆవరణలో అభినందన సభ జరగనుందని హిందీ మంచ్ జోనల్ కార్యదర్శి కోనే శ్రీధర్, ప్రతినిధులు బాడ మంజుల, ఆర్. రామారావు ఒక ప్రకటనలో తెలుపుతున్నారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్. ఈశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరవుతారని తెలిపారు. కేంద్ర సహకార, భూవిజ్ఞాన మంత్రిత్వ శాఖల హిందీ సలహా మండలి సభ్యుడు ఎస్ .గైబువల్లి ప్రత్యేక అతిథిగా హాజరవుతారని, సభకి కోనే శ్రీధర్ అధ్యక్షత వహిస్తారని వారు తెలిపారు. డీఈవో రవిబాబు, విశ్రాంత డీఈవో బలివాడ మల్లేశ్వరరావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర స్థాయి ఉమ్మడి మూడు జిల్లాల హిందీ టాలెంట్ టెస్ట్ జిల్లా టాపర్ విద్యార్థులుగా నిలిచిన విజేతలకు



సర్టిఫికెట్స్, మెడల్స్ తో సన్మానం, హిందీ ఉపాధ్యాయులకు సత్కారం, హిందీ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి సన్మానం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల్లో జిల్లా స్థాయి హిందీ ప్రతిభా పరీక్షలో పాల్గొన్న పాఠశాలల హిందీ ఉపాధ్యాయులతో పాటు హిందీ భాషాభిమానులు కూడా హాజరు కావచ్చునని కోనే శ్రీధర్, మంజుల, రామారావు తెలిపారు.

# సోము వీర్రాజుపై దాడి హేయమైన చర్య

**నవతరం -శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్, సీనియర్ ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై వైసీపీ సభ్యులు భౌతిక దాడి హేయమైన చర్య అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం అన్నారు. నగరంలోని ఆదివారం పేట సమీపంలో ఉన్న బిజెపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడి వేణుగోపాలం మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ తిరుపతి లడ్డులో కల్తీకి పాల్పడి ఘటనపై చర్చిస్తున్న సమయంలో ఇటువంటి దాడులు చేయడం వైసిపి నాయకులకు తగదని హెచ్చరించారు. వైసీపీ నాయకుల దాడి ప్రజాస్వామ్య విలువలకు తీవ్ర మచ్చగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 151 సీట్లు సాధించిన వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసి బుద్ధి చెప్పిన ఇంకా వారిలో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. బిజెపి నాయకులు, ఏబీబీ ఎస్ జాతీయ కన్వీనర్ పోకతోట సింహాచలం మాట్లాడుతూ సాసలిమండలి అంటేనే పెద్దల సభ అని, సభలో సీనియర్ సభ్యుడైన సోము వీర్రాజుపై ఇలాంటి అసభ్యకర భౌతిక దాడికి పాల్పడడం దిగజారుడుతనమే అవుతుందని చెప్పారు. ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలను ఎన్నటికీ ఊరుకోదు" అని హెచ్చరించారు. హోంమంత్రి అనిత, మహిళా మంత్రులు ఉన్నప్పటికీ వైసీపీ సభ్యులు గౌరవం లేకుండా ప్రవర్తించారని, సభా సభ్యతా సంస్కారాలను పూర్తిగా ఉల్లంఘించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశం లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సేవ్వాన ఉమామహేశ్వ రి, జిల్లా ఉపాధ్యక్షులు బైరి అప్పారావు, జిల్లా కార్యదర్శి బైపల్లి రాజేశ్వరి, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ సింగపురపు వెంకటరమణ, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు దన్నాన మదన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావు, జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు కణితి విష్ణుమూర్తి, శ్రీకాకుళం రూరల్ మండలం అధ్యక్షులు గొల్లంగి అసిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

## పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే వేటు



**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా కేంద్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలతో యంత్రాంగాన్ని ఉరుకులు పరుగులు పెట్టించారు. తొలుత డీసీసీబీ కాలనీలో పర్యటించిన ఆయన, కాలువల్లో పేరుకుపోయిన పూడికను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ప్రైవేట్ ఆర్ఓ ప్లాంట్లను పరిశీలించి, ఆర్డబ్ల్యూఎస్ కెమిస్టుల ద్వారా నీటి నమూనాలను సేకరించారు. నగరంలోని అన్ని ఆర్ఓ ప్లాంట్లపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.
పీఎస్ఎన్ఎం, డగ్లస్ పాఠశాలల పరిసరాలను తనిఖీ చేసిన కలెక్టర్, కూరగాయలు, పండ్ల వ్యాపారులు రోడ్ల పక్కన నిర్లక్ష్యంగా వ్యర్థాలు వేయడంపై తీవ్రంగా స్పందించారు. వ్యర్థాలను ప్రతిరోజు మున్సిపల్ సిబ్బందికి అప్పగించాలని, లేనిపక్షంలో దుకాణాలను సీజ్ చేయాలని హెచ్చరించారు.
రిమ్స్ ఆసుపత్రి పరిసరాల్లో డ్రైనేజీలు, రోడ్లను పరిశీలించిన కలెక్టర్, చెత్తను డస్ట్‌బిన్లలో వేయకుండా రోడ్లపై విసిరే వారిపై భారీ జరిమానాలు విధించాలని ఆదేశించారు. ఈ విషయంలో విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోని ఎస్టీ పోస్ట్ మెట్రిక్ బాయ్స్ హాస్టల్‌ను సందర్శించి, వంటగది, వసతి గదులను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న బాత్‌రూమ్ పనులపై పలు సూచనలు చేస్తూ, విద్యార్థులు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని వార్డెన్లకు దిశానిర్దేశం చేశారు.
శాంతినగర్ మున్సిపల్ పంప్ హౌస్ వద్ద ఐపీఎం ( ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్) బృందం సేకరిస్తున్న నీటి నమూనాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. డయేరియా ప్రభావిత ప్రాంతాలతో పాటు నగరంలోని అన్ని వార్డుల నుంచి శాంపిల్స్ సేకరించాలని ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా యంత్రాంగం పనిచేస్తోందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# తాగునీటిలో 'ఈ-కోలి'.. అందుకే డయేరియా

**నవతరం -శ్రీకాకుళం**

నగరంలో సేకరించిన తాగునీటి నమూనాల్లో ప్రమాదకరమైన 'ఈ-కోలి' బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణ అయిందని, ఇదే అతిసార వ్యాప్తికి ప్రధాన కారణమని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి ఆయన నగరంలోని అతిసార ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. సిమ్మన్న ఆసుపత్రి, బోడెమ్మ కోవెల, ఎచ్చెర్ల వీధి పరిసరాల్లో పారిశుధ్య పనులు, తాగునీటి పైపులైన్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎచ్చెర్ల వీధిలో చికిత్స పొందుతున్న ఒక కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడి, వైద్య సాయం అందిన తీరును ఆరా తీశారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో ఇప్పటివరకు 158 డయేరియా కేసులు నమోదు కాగా, 111 మంది చికిత్స పొందుతున్నారని, 47 మంది డిస్చార్జ్ అయ్యారని తెలిపారు. "సేకరించిన నీటి నమూనాల్లో 11 చోట్ల 'ఈ-కోలి' బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించాము. ప్రజలు డ్రైనేజీ కాలువల మీదుగా అక్రమంగా తాగునీటి కనెక్షన్లు తీసుకోవడం, వాటికి మోటార్లు బిగించి నీటిని లాగడం వల్ల భూగర్భంలోని మురుగునీరు మంచినీటిలో కలుస్తోంది. అలాగే రోడ్లపై పశువులను వదలడం వల్ల కలిగే వ్యర్థాలు కూడా నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా



శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించామ"ని వివరించారు.
అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో కమిషనర్ పాల్గొన్నారు. కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గత పది రోజులుగా క్షేత్రస్థాయిలో అంబులెన్స్‌లు, సర్వేలెన్స్ టీమ్‌లు అందిస్తున్న సేవలను వివరించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నీటిని కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని, తాత్కాలికంగా అక్రమ కనెక్షన్లు, మోటార్ల వాడకాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.
విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి, డి ఎం హెచ్ ఓ అనిత, పలువురు మున్సిపల్ అధికారులు హాజరయ్యారు.

# గిరిజన భూములకు రక్షణ కల్పించాలి



**నవతరం- మందస**

గిరిజన సమస్యలు పరిష్కరించాలని, గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సవర.గురునాద్, కె.మోహనరావు, యన్.గణపతి, మట్ట.ధర్మారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మందస మండలం తహశీల్దార్ గారికీ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మాణిక్య పట్నంలో మంచినీటి బోరు నిర్మించాలని,కారంటుపోల్ లు కొత్తగా వేయాలి, బుడంబో జంక్షన్ నుండి భావనాపురం వరకు రోడ్డు నిర్మించాలని, తుఫాన్ వల్ల వంగిపోయి కరెంట్ స్తంభాలు మార్చాలని, సింగుపురం,బావనపురంలో శ్మశాన ఆక్రమణలు తొలగించాలని, మాణిక్య పట్నం,బావనపురం, బాల్యసాయ్ గ్రామాల్లో అంగన్వాడి భవనాలు నిర్మించాలి, ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు గ్రామాలసమస్యలు పరిష్కరించాలని, కొండలోగం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్9, 26 లోగల 90 ఎకరాల భూమి సాగులో ఉన్న 120 కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని వారన్నారు. ఈ సమస్యలపై 2025 జూలై నెలలో గిరిజన గ్రామాల లో సమస్యలు సర్వే చేసి ఆదివాసి గిరిజన సంఘం మండల తహశీల్దార్ గారి కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతి పత్రం ఇచ్చారు. ఇ ప్పటికీ ఆ సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

### సిర్ల ప్రసాద్, గంగరావు సింహాచలం పిలుపు



**నవతరం-నరసన్నపేట**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీకాకుళం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా 18వ మహాసభలను 2026 ఏప్రిల్ 4, 5 తేదీల్లో నరసన్నపేట కేంద్రంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి గంగరావు సింహాచలం మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు వ్యవసాయ రంగంలో సంపద సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికుల శ్రమ ఫలితంగానే సామాన్యుని నుంచి దేశ ప్రధాని వరకు అందరికీ ఆహారం అందుతుందని పేర్కొన్నారు. వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే సంఘం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది ప్రతినిధులు ఈ మహాసభలకు హాజరవుతారని తెలిపారు. జిల్లాలో నిర్వాసితుల సమస్యలు, గిరిజనుల సమస్యలు, రైతాంగ పోరాటాలు, భూమి, కూలి, ఉపాధి హామీ వంటి అంశాలపై చర్చించి పోరాటాలకు దిశానిర్దేశం చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనసాగుతున్న సమస్యల నేపథ్యంలో ఈ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కె. ఎల్లయ్య, జి. ఈశ్వరమ్మ, కె. అప్పలనాయుడు, జె. నర్సింహులు, బి. ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# కాచివడపోచిన నీటినే త్రాగాలి

- సింధూర వైద్యశాల నుండి కూడా పూర్తి సహకారాలు అందిస్తాం
- లయన్ డా.పైడి.సింధూర
- డయోరియా రోగులను పరామర్శించిన లయన్స్ బృందం



**నవతరం -శ్రీకాకుళం**

కాచివడపోచిన నీటినే త్రాగాలని, డయోరియా బారినపడిన వారు భయపడాల్సిన అవసరం లేదని, కానీ ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని, లయన్ డా.పైడి.సింధూర అన్నారు. స్థానిక కిమ్స్ వైద్యశాలలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో డయోరియాతో బాధపడుతున్న రోగులకు పరామర్శించి పళ్ళు, ఫలాలను అందించి తగు సూచనలు అందించారు. ఇందులో భాగముగా క్లబ్ మెంటార్ నటుకుల.మోహన్, కార్యదర్శి టెక్కం.రామ్ గోపాల్ తో కలసి సందర్శించిన అనంతరం డా.సోమేశ్వర రావును కలసి, ప్రస్తుత పరిస్థితుల కోసం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటినే త్రాగాలని, వాంతులు, విరోచనాలు లేదా జ్వరం అని అనిపించినా అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఇంకా అవసరం అనుకుంటే సింధూర వైద్యశాల నుండి కూడా పూర్తి సహకారాలు ఉచితంగా అందిస్తామని, వీలైనంత వరకు బయట దొరికేఆహారానికి దూరంగా ఉండాలన్నారు. మెంటార్ నటుకుల.మోహన్ మాట్లాడుతూ ఇంట్లో వండిన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, వేడి చేసిన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యమన్నారు.
ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉపాధ్యక్షులు ఉర్లం.శివతేజ, కిమ్స్ వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# జీవనోపాధి అవకాశాల కోసం సమగ్ర ఆదాయ అంచనా

**నవతరం-మందస**

జీవనోపాధి అవకాశాల కోసం సమగ్ర ఆదాయ అంచనా నిర్వహిస్తున్నట్లు వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ సేర్ఫ్ ద్వారా మహిళా సంఘాల కుటుంబ సభ్యుల ఆదాయ స్థాయి, వారి కుటుంబానికి వాస్తవం గా కావలసిన జీవనోపాదులను గుర్తించి అవసరం ఆయన రుణ పరపతి సౌకర్యాన్ని కల్పించడానికి పల్లె పల్లెలో పారదర్శక కుటుంబ ఆదాయ సర్వే చేపడుతున్నట్లు వివరించారు. శుక్రవారం, మండల పరిధిలో గల సిద్దిగాం గ్రామ సంఘం లో సర్వే నిర్వహిస్తున్న ఈనారీ సిఆర్పిల తో మాట్లాడుతూ యాప్ వినియోగం లో లోటుపాట్లు ను అడిగి తెలుసుకొని వారి కుటుంబ ఆదాయాన్ని ఖచ్చితంగా తెలుసుకొని ఒక బుక్ లో నమోదు చేసుకొని మరీ వాస్తవం గా నమోదు చేయించాలని సిబ్బంది అందరికీ సూచనలు చేశారు.
మహిళా స్వయం సహాయక సంఘం కుటుంబ సభ్యులలో వాస్తవంగా యాక్టివిటీ ఉండి సంపాదిస్తున్న అందరి ఆదాయం కూడా ఖచ్చితంగా పారదర్శకం గా నమోదు చేసుకోవాలని భవిష్యత్ లో వారికి అవసరమైన



పరపతి ఋణ సౌకర్యాలు మొదలగు అవసరాన్ని బట్టి అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు బి.రోజా , వెలుగు వి.ఓ.ఏ. లక్ష్మి తో పాటు క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, ఈనారీ సిఆర్పిలు,ప్రీతి, దివ్య,సుమలత తదితరులు పాల్గొన్నారు.



# పలాస జిల్లాను చేస్తామంటూ చివరి తప్పించడం అన్యాయం

- పాత 12 జిల్లాలను 27 జిల్లాలుగాచేసేటప్పుడు.. పలాసను ఎందుకు విస్మరించారు?
- పలాస జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తేనే స్వాతంత్ర్య ఫలాలు సిద్ధిస్తాయి
- ఇదేనా సమాన అభివృద్ధి?
- పాలకుల వివక్షత వల్లే ఉద్దానం వెనుక బాటుతనం
- వలసల నివారణకు సాగునీటి వనరుల కోసం వంశధార జలాలు అందివ్వాలి
- పలాస జిల్లా కేంద్రాన్ని విస్తరించడం పట్ల రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం తథ్యం
- అభివృద్ధి ఫలాలు వెనుకబడిన ప్రాంతానికి అందాలంటే.. పలాస జిల్లా కేంద్రంగా ఏర్పాటు అనివార్యం
- ప్రజల ఆకాంక్షలు తీరేవరకు పోరాటం కొనసాగిస్తాం
- పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా)

**నవతరం - పలాస**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పేరుతో పాత 12 జిల్లాలను 27 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరణ లో భాగంగా కూటమి ప్రభుత్వం పలాస జిల్లాను ఏర్పాటు చేస్తామని చెప్పి, చివరి క్షణంలో తప్పించడం.. ఘోరమైన అన్యాయమని ప్రముఖ సామాజికవేత్త,న్యాయవాది,పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ ( బాబా) ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పలాసలో ఆయన స్వగృహం నందు మీడియాతో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచినప్పటికీ, రాజ్యాంగం ప్రసాదించిన అభివృద్ధి ఫలాలు సమానంగా అందించవలసి ఉండగా, శ్రీకాకుళం జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురైనాయని, అందువల్ల ఉద్దానంతోపాటు పాతపట్నం, టెక్కలి నియోజకవర్గాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని, అందువల్ల ఈ ప్రాంతం వలసల అడ్డాగా ముద్రపడ్డాయని దువ్వాడ శ్రీధర్ ( బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ వల్ల ఆయా ప్రాంత ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు లభించడం వల్ల అధిక ప్రయోజనాలకు కలుగుతాయని, ఒక్క శ్రీకాకుళం జిల్లా విషయంలో మాత్రం కొన్ని నియోజకవర్గాలు పూర్తిస్థాయిలో సమానమైన నిధులు వాటా పొందలేకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుందని ఆయన వివరించారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా జనాభా దామాషా పద్ధతిలో నిధులు కేటాయింపులు ఉండాలని, అయితే శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇచ్చాపురం నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమని, అక్కడ ప్రజానీకం వైద్య, ఆరోగ్య అవసరాల కోసం గానీ ఇతర కీలక పనులు నిమిత్తం శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి రావాలంటే దాదాపు 130 కిలోమీటర్ల వరకు ఇబ్బందికరమైన ప్రయాణం చేయవలసిన పరిస్థితి కొనసాగుతుందన్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎటువంటి భారీ పరిశ్రమలు లేవని, వంశిధార నదీ జలాలు ఇచ్చాపురం వరకు తరలిస్తే, ఇక్కడ వ్యవసాయం సస్యశ్యామలమవుతుందన్నారు. మూలపేట ఓడరేవు అందుబాటులోకి వస్తే పలాస కేంద్ర బిందువుగా మారడం వల్ల, అనేక పరిశ్రమలు వస్తాయని, అదేవిధంగా స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, వ్యవసాయ రంగం కూడా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో దశాబ్దాలు నుండి ఈ ప్రాంతం నిర్లక్ష్యం చేయబడిందని, అయినప్పటికీ పలాస కేంద్రంలో జీడి పరిశ్రమ స్వతహాగా నిడదొక్కోవడం వల్ల అంతర్జాతీయ స్థాయిలో పలాస జీడిపప్పుకు మంచి గుర్తింపు ఉందని, ఈ పరిశ్రమ ద్వారా సుమారు 30000 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారని ఆయన గుర్తు చేశారు. ఎన్నో దశాబ్దాల నుంచి ఈ ప్రాంత అభివృద్ధిపై కొందరు పాలకులు నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్రంలో మిగతా ప్రాంతాల అభివృద్ధి కంటే వెనకబడిపోవడానికి కొందరు పాలకులు చేసిన అన్యాయమే నన్నారు. జాతీయ రహదారి, రైల్వే లైను, సముద్ర తీరం, పరిశ్రమలు నెలకొల్పోయినందుకు మరికొన్ని బీడు భూములు, ప్రభుత్వ బంజరు భూములు ఉన్నాయన్నారు.
ఇప్పుడిప్పుడే పలాస పట్టణీకరణ దిశగా ప్రయాణం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పాతపట్నం, టెక్కలి, ఇచ్చాపురం నియోజకవర్గాలతో పాటు పలాస నియోజకవర్గం కలిపి జిల్లాను ఏర్పాటు చేస్తే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు వాటా ఈ ప్రజానీకం అవసరాలకు ఉపయోగపడటం వల్ల, ఇక్కడ ప్రజానీకం జీవన ప్రమాణాలు ఎంతో మెరుగుపడతాయని, ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని దువ్వాడ శ్రీధర్ ( బాబా) డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం ప్రజాస్వామ్యంలో శాశ్వతం కాదని, చేసిన అభివృద్ధి పనులే మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు తీర్పునిస్తుంటారని, అలా కాదని పలాస ప్రాంత ప్రజలకు అన్యాయం చేసిన పాలకులకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పక మునుపే.. మేల్కొని ఉద్దానం ప్రాంత ప్రజల ఆకాంక్షలకు తగిన విధంగా గుర్తించి తక్షణం పలాస జిల్లాను ప్రకటించాలని, లేకపోతే ఈ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని దువ్వాడ శ్రీధర్ ( బాబా) హెచ్చరించారు.

# విద్యార్థులు సమాజసేవలో భాగం కావాలి

**నవతరం -శ్రీకాకుళం**

విద్యార్థులు సమాజసేవలో భాగంకావాలని, న్యూ సెంట్రల్ పాఠశాల డైరెక్టర్ పి. శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విస్రాంత విద్యాశాఖాధికారి బలివాడ.మల్లేశ్వర రావు అన్నారు. ఈ సందర్భంగా న్యూ సెంట్రల్ పాఠశాల డైరెక్టర్ పి. శ్రీకాంత్, ప్రధానాచార్యులు బలివాడ.మల్లేశ్వర రావు వేరు వేరు ప్రకటనలో శుక్రవారం మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు, సామాజిక సేవా రంగాల్లో మక్కువ చూపాలన్నారు. భావితరానికి ఉత్తమ నాయకులుగా ఎదిగి, సమాజసేవలకు స్ఫూర్తిప్రదాతలుగా నిలవాలనే దృఢ సంకల్పంతో గత 8 సంవత్సరాలుగా పాఠశాల విద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల యాజమాన్యం సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు రక్తనిధి కేంద్ర బృందంతో ప్రతి ఏటా ఈ శిబిరాన్ని నిర్వహించి, తలసీమియా, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల చిన్నారులకు ఉచితంగా రక్తాన్ని అందిస్తున్నారని, మార్చి 1న జరగబోయే రక్తదాన శిబిరానికి జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థుల తల్లితండ్రులు, బంధువులతోపాటుగా, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు, రక్తదాతలు పాల్గొనున్నారన్నారు. చిన్న నాటి నుండే విద్యార్థులు చదువుతూ, సమాజసేవలో ఎలా మెలగాలో, క్రమశిక్షణ, విలువలు కలిగిన అభ్యసిస్తున్నామని, ఈ శిబిరంలో ప్రతీ ఒక్కరూ పాల్గొని రక్తదానంతో, ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**